

రుయా ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షునిగా జి.మునిచంద్ర



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రుయా ఆసుపత్రి ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షునిగా జి. మునిచంద్ర ఎన్నికయ్యారని ప్రధాన కార్యదర్శి నరసింహులు, కార్యదర్శి గురవయ్యలు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం అత్యవసరంగా జరిగిన ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశంలో నూతన అధ్యక్షులుగా మునిచంద్ర ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించేది లేదని, సిఐటియు నిబంధనావళికి భిన్నంగా వ్యవహరించిన యూనియన్ మాజీ అధ్యక్షులు ఎన్.సుబ్రమణ్యంను సంఘం ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరించినట్లు తెలిపారు.

ఎస్సీవీ 'యూ టర్న్'

కూటమి అభ్యర్థిని పరిశీలించాలి
తానింకా రేసులో ఉన్నానంటూ ప్రకటన
శ్రీకాళహస్తి రాజకీయాల్లో నయా 'ట్విస్ట్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎంపికపై మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు యూటర్న్ తీసుకున్నారు. ప్రస్తుతం ప్రకటించిన కూటమి అభ్యర్థి సమర్థత, విశ్వసనీయతపై ప్రజల్లో, పార్టీ కేడర్లో తీవ్ర వ్యతిరేకత, అనుమానాలున్నాయని పరోక్ష విమర్శలు చేశారు. 40 ఏళ్ళ సుదీర్ఘ రాజకీయ అనుభవం, ఓ సారి ఎమ్మెల్యేగా తనను తాను నిరూపించుకున్నాననీ, తన సమర్థత, విశ్వసనీయతను నమ్మి వయస్సు రీత్యా తనకే అవకాశం కల్పించాలంటూ మీడియా ముఖంగా టీడీపీ అధినేత చంద్రబాబును కోరారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు బుధవారం ఆయన స్వగృహంలో అనుచరవర్గంతో కలిసి మీడియా ముందు మాట్లాడారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ టిక్కెట్టుపై మొదటి నుంచి తాను ఆశలు పెట్టుకున్నట్లు తెలిపారు. 2019లో జరిగిన తప్పును పునరావతం కానివ్వనని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చినట్లు చెప్పారు. అయితే టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడ్డ తర్వాత బొజ్జల సుధీర్ రెడ్డికి అధిష్టానం టిక్కెట్టు కేటాయించడం బాధ కలిగించిందన్నారు. అయితే టిక్కెట్టు ప్రకటన అనంతరం తాను భవిష్యత్ కార్యాచరణపై శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల టీడీపీ కార్యకర్తలతో సమావేశమైనప్పుడు బొజ్జల సుధీర్ రెడ్డి తనను కలిసి మద్దతు కోరారని చెప్పారు. ఆయన అభ్యర్థన మేరకు మీడియా ముందుకు వచ్చి అదేవిధంగా చెప్పాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. అంతేకానీ తమ ఇద్దరి మధ్య ఎలాంటి ఒడంబడిక జరగలేదని వివరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కబ్జాలు, రౌడీయిజం పేట్రేగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు సొంత పార్టీలో అవమానాలే జరుగుతున్నాయని వినుత, చక్రాల ఉష, ముని రాజమ్మ ఉదంతాలను ఉదహరించారు. నేటి శ్రీకాళహస్తి రాజకీయాన్ని తలుచుకుంటే భయం వేస్తోందనీ, భవిష్యత్తుపై బెంగ పుడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం కారణంగా కూటమి అభ్యర్థుల విషయంలో శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందనీ, చంద్రబాబు పున్ణ పరిశీలించాలని సూచించారు. వయసు రీత్యా తనకు ఎమ్మెల్యేగా చివరి అవకాశం కల్పించాలనీ, తదనంతరం తాను రాజకీయాల్లో నుంచి శాశ్వతంగా తప్పుకోనున్నట్లు ప్రకటించారు. తన అభ్యర్థిత్వంపై అనుచరవర్గంతో కలిసి త్వరలో చంద్రబాబును కలవనున్నాననీ, అనంతరం తన తుది నిర్ణయాన్ని మీడియా ముఖంగా వెల్లడిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య, స్కిట్ మాజీ చైర్మన్ గురుదశరథన్, సత్రవాడ ప్రవీణ్, ఎస్సీవి దిలీప్ నాయుడు పాల్గొన్నారు.


బొజ్జల సుధీర్‌కు వద్దంటూ మీడియా సమావేశంలో ఎస్సీవీ నాయుడు

వీరికి రెబల్స్ 'పోటు'


కె.లక్ష్మీప్రియ, వెంకటగిరి


ఆరణి శ్రీనివాస్, తిరుపతి


బొజ్జల సుధీర్, శ్రీకాళహస్తి


కోనేటి ఆదిమూలం, సత్యవేడు

టిడిపిలో పొత్తు రాజకీయం జ్వాలలు రేపుతోంది.. గత ఐదేళ్లలో అధికార పార్టీతో ఢీకొన్న తిరుపతి మాజీ ఎంఎల్ఎ ఎం.సుగుణమ్మ, శ్రీకాళహస్తిలో తన 40 ఏళ్ల రాజకీయ వయస్సును దృష్టిలో ఉంచుకుని టిక్కెట్ ఆశించిన ఎస్సీవీ, సత్యవేడులో జెడి రాజశేఖర్, వెంకటగిరిలో బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి మస్తానయ్య 'రెబెల్' బాట పట్టారు. బుధవారం మీడియా సమావేశాలు వేర్వేరుగా ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించి, అధినేత నారా చంద్రబాబునాయుడు పునరాలోచించి, అభ్యర్థుల మార్పు చేయాలని పట్టుబడుతున్నారు. లేదంటే...స్వతంత్రంగా బరిలో దిగినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఇప్పటికే సత్యవేడులో రెబెల్ అభ్యర్థి ప్రచారం మొదలెట్టేశారు.

పక్కా ప్రణాళికతో విధులు నిర్వర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాస్థాయి ఎన్నికల నోడల్ అధికారులు పూర్తిస్థాయి అవగాహనతో, పక్కా ప్రణాళికతో విధులు నిర్వర్తించాలని, ఎటువంటి పరిస్థితుల్లోనూ అలసత్వం ఉండరాదని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీ శ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. సి - విజిల్ లో అందిన ఫిర్యాదులు ఎన్నికల సంఘం సూచించిన 100 నిమిషాల్లో పరిష్కరించాలని సూచించారు. ఎంసిసి ఉల్లంఘనలు ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని, తప్పని సరిగా చర్యలు ఉంటాయని, అధికారులు అందరూ ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోనున్న నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో అధికారులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎటు వంటి రాజకీయ ప్రచారాన్ని అనుమతించరాదని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుండి లిక్కరు, ఓటర్లను ప్రభావితం చేసే పలు రకాల వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కులశేఖర్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరచిన గోదాములను కలెక్టర్ జి.లక్ష్మీ శ బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల రపతినిధులతో కలిసి పరిశీలించారు. పిఒ, ఎపిఒల శిక్షణ నిమిత్తం వినియోగించనున్న వివిప్యాట్‌లను అత్యంత జాగ్రత్తగా సంబంధిత అధికారులు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి శిక్షణ నిమిత్తం వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవిఎం గోడౌన్ ఇంఛార్జి ఎస్డిసి కోదండ రామిరెడ్డి పాల్గొన్నారు.


తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో అదితిసింగ్

నియమ నిబంధనలు పాటించాలి : అదితి సింగ్

ఎలక్షన్ కమిషన్ రూపొందించిన ఎన్నికల నియమ నిబంధనలను అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ తెలిపారు. తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే ఎన్నికల కమిషన్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుందన్నారు. అర్బన్ ఎంఆర్ఒ వెంకటరమణారెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిఎస్పి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

'ఆరణి'కి అడ్డుకట్ట

తెరపైకి ఆవుల మోహన్
రంగంలోకి ఎన్వీ ప్రసాద్
తిరుపతిలో కొత్త సమీకరణలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జనసేన- టిడిపి - బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులును ప్రకటించినప్పటి నుంచి మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. 'స్థానికులకు' ఎవరికి టికెట్ ఇచ్చినా టిడిపి వారంతా కలిసి పనిచేస్తామని ఆత్మీయ సమావేశంలో ఆయా పార్టీల తిరుపతి శ్రేణులు చెబుతూనే ఉన్నాయి. ఆరణి శ్రీనివాసులును పక్కన పెట్టి తెరపైకి మాజీ ఎంఎల్ఎ ఆవుల మోహన్‌కు జనసేన కండువా కప్పి అభ్యర్థిగా ప్రకటించాలని సినీ నిర్మాత ఎన్వీ ప్రసాద్ రంగంలోకి దిగారు. మరోపక్క సింధూరి వెంకయ్య ఆరణి శ్రీనివాసులుకు మద్దతు ప్రకటిస్తూ తన హోటల్లో సమావేశాలు జరుపుకునేందుకు వీలుగా ఓ అంతస్తును కేటాయించారు. స్థానికేతరుడనడంతో హడావిడిగా పద్మావతిపురంలో వెంకయ్యే స్వయంగా గృహప్రవేశం చేయించారు. టిడిపి నుంచి టిక్కెట్ ఆశిస్తున్న మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, వూకా విజయ్‌కుమార్, జెబి శ్రీనివాస్, డాక్టర్‌కోడూరు బాలసుబ్రమణ్యంతో పాటు బిజెపి నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్ తదితరులు మద్దతు కోసం వెళ్లాలని సింధూరి వెంకయ్యే వెనకుండి నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆరణి శ్రీనివాసులు అందరినీ కలుస్తుండగా పై నలుగురిని కలవడానికి ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదు. టిడిపి అధినేత నారా చంద్రబాబు వద్దకు వెళ్లి తాను జనసేనలో చేరతానని, టిక్కెట్ ఇచ్చేలా పవన్‌కల్యాణ్‌కు రికమండ్ చేయాలని ఆవుల మోహన్‌కు ఎన్వీ ప్రసాద్ డైరెక్షన్ ఇస్తున్నారు. ఆవుల మోహన్ చంద్రబాబును కలవాలని ప్రయత్నించగా మూడు రోజుల వరకూ అవకాశం లేదని చెప్పినట్లు తెలుస్తోంది. కోడూరు బాలసుబ్రమణ్యం బుధవారం కపిలతీర్థంలో జరిగిన ప్రచారంలో ఆరణి శ్రీనివాసులుతో కలవడం గమనార్హం. అయితే మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎటువంటి పరిస్థితుల్లోనూ ఈ సీటు టిడిపికే దక్కించుకోవాలని, జనసేనకు పోతే అభ్యర్థి గెలుపుకు 'రెబల్'గానే ఉండేలా తీర్మానం చేశారు. టిక్కెట్ కోసం పోటీ పడిన జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ అధినేత పవన్ మాట కాదనలేక అయిష్టంగానే పనిచేస్తున్నారు. ఏదిఏమైనా తిరుపతి కూటమి రాజకీయం రోజుకో మలుపు తిరుగూనే ఉంది. పార్టీలతో నిమిత్తం లేకుండా టిక్కెట్ కోసం ఏ పార్టీ అయినా మారేలా తిరుపతి రాజకీయం మారడం శోచనీయం.

తిరుపతి సీటు స్థానికులకే ఇవ్వాలి : సుగుణమ్మ

తిరుపతి టౌన్ : తిరుపతి ఎంఎల్ఎ అభ్యర్థి స్థానికుడు కాదని, చిత్తూరు నుంచి వలస వచ్చారని, ప్రచారంలో ఈ ఇబ్బందిని ఖచ్చితంగా ఎదుర్కోవాల్సి ఉంటుందని మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ అన్నారు. తిరుపతిలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ గత 57 నెలలుగా అటు జగన్మోహన్‌రెడ్డి పాలనపై ఇటు తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డి చేస్తున్న అరాచక పాలనను టిడిపి, జనసేన పార్టీలు ఎదుర్కొన్నాయన్నారు. స్థానికులకే టిక్కెట్ ఇస్తే ఖచ్చితంగా వైసిపిని ఘోరంగా ఓడిస్తామన్నారు. ఈ సమావేశంలో మహేష్‌యాదవ్, చిన్నబాబు, బ్యాంకు శాంతమ్మ పాల్గొన్నారు.


ఆరణి శ్రీనివాస్‌కు టిక్కెట్ వద్దంటున్న సుగుణమ్మ

సత్యవేడులో రె'భైల్'

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

సత్యవేడులో వైసిపి నుంచి వలసొచ్చిన సిట్టింగ్ ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలంకు అవకాశం ఇవ్వడంతో రె'భైల్' మోగింది. సీనియర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని ముసలం ప్రకటించారు. నిన్న మొన్నటివరకూ సత్యవేడు వైసిపిలో గ్రూప్‌లుండేవి. దీంతో టిడిపి టిక్కెట్ ఎగరడం ఖాయమని టిడిపి శ్రేణులు నమ్మకంగా ఉన్న నేపథ్యంలో వలసొచ్చిన ఆదిమూలంకు టిక్కెట్ ఇవ్వడంతో శ్రేణుల్లో నిరాశ మొదలయ్యింది. కోనేటి ఆదిమూలం టిడిపి, జనసేన కార్యకర్తలను ఇబ్బంది పెట్టారన్నది వారి వాదన. టిడిపి ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న కార్యకర్తలను, సీనియర్లను సంప్రదించకుండా కొంతమంది స్వార్థపూరిత రాజకీయ నాయకుల మాటలు విని హైకమాండ్ తప్పుడు నిర్ణయం తీసుకుందని వారు కినుక వహిస్తున్నారు. పార్టీలో సముచిత స్థానం లేనందునే తాము పార్టీకి దూరంగా ఉన్నామని వారు వాపోతున్నారు. టిడిపికి కంచుకోటగా ఉన్న సత్యవేడులో 2019లో బీటలు వారాయని, ప్రస్తుతం అధినేత ప్రకటించిన అభ్యర్థిపై వ్యతిరేకత ఉందని సీనియర్లు పెదవి విరుస్తున్నారు. అభ్యర్థి ప్రకటనపై పున్ణపరిశీలన చేయాలని కోరుతున్నారు.

ముస్లింలకు సముచిత స్థానం ఎక్కడ?


నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ ఓటర్లను సమన్వయపరచడంలో కీలక పాత్ర పోషించిన మహ్మద్ నవాబ్ ఇటీవల పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే తాను రాజీనామా చేసినా పార్టీ ఇన్‌ఛార్జిలు గాని, స్థానికులు గాని తనను సంప్రదించకపోవడంపై మైనార్టీ ఓట్లు చీలుతాయని చర్చ నడుస్తోంది. పొత్తులో భాగంగా జనసేన, బిజెపితో కలిసి టిడిపి ఎన్నికల బరిలో దిగడంతో మైనార్టీ ఓట్లకు మింగుడు పడటం లేదు.

సీనియర్లు, మైనార్టీలు కినుక



ఆరూర్లో జెడిఆర్ ఎన్నికల ప్రచారం

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా కోనేటి ఆదిమూలం పేరు ప్రకటించడంతో ఇక్కడి నాయకుల్లోనూ, కార్యకర్తల్లోనూ అసంతృప్తి రగులుతోంది. ఈ క్రమంలో టిడిపి అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన జెడి రాజశేఖర్ ఆరూర్లో ప్రచారం నిర్వహించారు. గతంలో కోనేటి ఆదిమూలం ఎంఎల్ఎగా ఉన్నపుడు వైసిపి నిర్బంధాన్ని ఎదుర్కొన్నానని జెడి ప్రచారం చేస్తున్నారు. అధినేత పునరాలోచించని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా అయినా బరిలో దిగేలా ముందస్తు ప్రచారాన్ని ప్రారంభించారు.


తిరుపతి పరీక్షా కేంద్రం తనిఖీ చేస్తున్న కలెక్టర్

టెన్త్ పరీక్షా కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి

జిల్లాలో పదో తరగతి మెయిన్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ శ ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం శ్రీ పద్మావతి బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. తాగునీరు, ఎఎన్ఎం ఏర్పాటు, అత్యవసర మందులను పరిశీలించారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా జాగ్రత్తలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ నిషాంత్‌రెడ్డి ఉన్నారు.

ప్రశాంతంగా టెన్త్ ఆంగ్ల పరీక్ష

పదో తరగతి పరీక్షల్లో మూడోరోజైన బుధవారం ఆంగ్ల పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తిరుపతి జిల్లాలో 162 పరీక్ష కేంద్రాల్లో 6 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 162 మంది చీఫ్ సూపరింటెండెంట్ లు, 1753 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 26,941 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 26,570 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 371 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ పేర్కొన్నారు. 98.6 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రకటించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



నారా భువనేశ్వరికి ఘన స్వాగతం

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)

రాయచోటిలో నిజం గెలవాలి కార్యక్రమం కోసం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఘన స్వాగతం పలికారు. తుమ్మలగుంట పరిధిలో మఠం భూమిలో నిర్మించిన, ఆక్రమించిన అధికార పార్టీ నాయకులు, బడాబాబులు జోలికి వెళ్లకుండా మఠం అధికారులు పేదల షెడ్లను పోలీసు జులుంతో తొలగిస్తున్న సందర్భంలో పేదల పక్షాన నిలబడి పోరాటం సాగిస్తున్న సమయంలో పోలీసుల తోపులాటలో గాయాలైన పులివర్తి సుధారెడ్డిని నారాభువనేశ్వరి పరామర్శించారు. ఏ రంగంపేట- భాకరాపేట మార్గంలో రాయచోటి బయలుదేరిన ఆమెను దుశ్శాలువాలతో మహిళలు సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తి

ప్రజాశక్తి - రేణిగుంట


ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తి లభిస్తుందని రాస్ విజ్ఞాన కేంద్రం ప్రకృతి వ్యవసాయ శిక్షణ నిర్వాహకురాలు నీలిమ అన్నారు. కరకంబాడిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రైతులకు అవగాహనా కార్యక్రమం జరిగింది. వివిధ రకాల తెగుళ్లను వివరించి జీవామృతం తదితర కషాయాల తయారీని వివరించారు. కెవికె శాస్త్రవేత్తలు పద్మజ, డాక్టర్ దివ్య, రాంకుమార్ పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన శిక్షణా కార్యక్రమంలో కెవిబిపురం, చిన్నగొట్టిగల్లు, తిరుపతి రూరల్, రేణిగుంట మండలాలకు చెందిన 120 మంది రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - తిరుపతి సిటి



వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలైన ఘటన మంగళవారం అర్ధరాత్రి తిరుపతిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు నాయుడుపేట - పూతలపట్టు ప్రధాన రహదారిలోని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల నందిని హోటల్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఓ కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొంది. ఈ ఘటనలో జపన్య కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో బిఎస్సి నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న తమ్మినేని నాని రెడ్డి (19) అక్కడికక్కడే మృతి చెందాడు. ఐతేపల్లిలోని స్నేహితుడు ప్రీతం పుట్టినరోజు వేడుకలకు మనోజ్, బద్రిలతో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కళాశాల స్నేహితులు మార్చురీకి చేరుకుని విలపించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. ముందుగా సాయంత్రం 6 గంటలకు శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రుని ఉత్సవమూర్తుల ఊరేగింపు మొదలైంది. తొలిరోజు శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివారు పుష్కరిణిలో తెప్పపై మూడు చుట్లు తిరిగి కనువిందు చేశారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి, సిఇ నాగేశ్వరరావు, ఎస్ ఈ జగదీశ్వర్ రెడ్డి, విజిఓలు నంద కిషోర్, గిరిధర్ రావు, బాల్ రెడ్డి, శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, పాల్గొన్నారు.

25 అసెంబ్లీ సీట్లలో ఆర్‌పిఐ పోటీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ నుండి 25 అసెంబ్లీ స్థానాల్లో, ఏడు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు రిపబ్లిక్ పార్టీ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర కార్యవర్గం తెలిపింది. బుధవారం విజయవాడ సీతారాంపురంలో గల పార్టీ కార్యాలయంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకా వెంకటేశ్వర అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎన్నికల ఇంచార్జ్ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు పి.అంజయ్య హాజరై ఇప్పటివరకు 25 అసెంబ్లీ స్థానాలకు, 7 పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థులను ఎంపిక చేశారు. మిగిలిన స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల రెండవ దశ జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా వరప్రసాద్, కార్యదర్శి గుణవతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జానకిరాం ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన బెల్జియం రాయబారి


ప్రజాశక్తి- వరదయ్యపాలెం

భారత్‌లోని బెల్జియం రాయబారి డిడియర్ వాండర్‌హాసెల్ట్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, ఇక్కడ ప్రపంచశ్రేణి మౌలిక వసతులు, ప్రత్యేకతలు, వేగవంతమైన పారిశ్రామిక ప్రగతి గురించి వివరించారు. బెల్జియంకు చెందిన వెర్మీరెన్‌తో సహ 29 దేశాల నుండి 220కి పైగా ప్రముఖ కంపెనీలకు నిలయంగా, భారతదేశంలో ప్రముఖ తయారీ కేంద్రంగా శ్రీసిటీ స్థానం దక్కించుకుందని పేర్కొన్నారు. భారత్ లో పెట్టుబడులు పెట్టాలనుకునే మరిన్ని బెల్జియన్ కంపెనీలకు తాను శ్రీసిటీని పరిచయం చేస్తానని చెప్పారు. రాయబారితో పాటు బెల్జియంలోని ఫ్లాండర్స్ రీజియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమీషనర్ జయంత్ నడిగర్ పాల్గొన్నారు.



'హెచ్‌కె' ఫిట్నెస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుపతిలో నూతనంగా హెచ్‌కె జిమ్ అండ్ ఫిట్నెస్ సెంటర్‌ను ప్రారంభించినట్లు సంస్థ అధినేత హరికష్ణ తెలిపారు. స్థానిక న్యూ బాలాజీ కాలనీలోని ఆ జిమ్ సెంటర్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి నగరంలో 10 సంవత్సరాలు పైగా జిమ్ సెంటర్ నడిపిన అనుభవంతో దీనిని ఏర్పాటు చేశామన్నారు. బాడీ బిల్డింగ్ లో రెండు గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించిన తాను, అందరి లైఫ్ స్టైల్ మార్చాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశానన్నారు. మహిళలు, పురుషులు అందరికీ సంబంధించిన అన్ని రకాల ఫిట్నెస్ పరికరాలు సరికొత్త టెక్నాలజీతో, లండన్ ఇతరత్రా విదేశాల నుంచి పరికరాలను తెప్పించామన్నారు. తమ శరీర దఢత్వాన్ని పెంచుకోవాలనుకున్నవారు, స్థూల కాయం, పెద్ద పొట్ట, బరువును తగ్గించుకోవాలనుకునేవారు, తమ సెంటర్ ను సందర్శించి ఇక్కడ పరికరాలను వినియోగించి, వారికి నచ్చితేనే, నమ్మకం కుదిరితేనే ఫీజులు చెల్లించాలని సూచించారు. డబ్బు ముఖ్యం కాదు, ప్రతి ఒక్కరికి ఫిట్నెస్ అందించాలని ఉద్దేశంతోనే దీన్ని ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. తనతో పాటు మరో ఇద్దరు అనుభవజ్ఞులైన, సర్టిఫికెటెడ్ శిక్షకులు ఇక్కడ అందుబాటులో ఉన్నారన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ షోరూం ప్రారంభోత్సవానికి సీనియర్ నాయకులు హరి ప్రసాద్ రెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, జెబి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

'వారాహి' ఆటోమొబైల్స్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



తిరుపతి నగరంలో జాయ్ ఈ బైక్స్ తో నూతనంగా ఏర్పాటు చేసిన వారాహి ఆటోమొబైల్స్ ను తిరుపతి నగర మేయర్ దంపతులు డాక్టర్ శిరీష, డాక్టర్ మునిశేఖర్ ప్రారంభించారు. రేణిగుంట రోడ్డులో ఏర్పాటు చేసిన ఆ షోరూం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎలక్ట్రికల్ బైకుల హవా కొనసాగుతుందన్నారు. పెట్రోల్, డీజిల్ వెహికల్ తో పోలిస్తే ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం ద్వారా 85శాతం వ్యయన్ని తగ్గించుకోవచ్చన్నారు. భవిష్యత్తు మొత్తం ఎలక్ట్రిక్ వాహనాలదేనన్నారు. వైసిపి నాయకులు అజయ్‌కుమార్, జనరల్ హెడ్ జగన్, రీజనల్ మేనేజర్ శోభన్, షోరూం ఎండి రాజశేఖర్ పాల్గొన్నారు.

కంచి కామాక్షి సిల్క్స్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి నిమ్మకాయల వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కంచి కామాక్షి సిల్క్స్‌ను మేయర్ డాక్టర్ శిరీష బుధవారం ప్రారంభించారు. మహిళలకు చీరలు అంటే మక్కువని, కంచి కామాక్షి సిల్క్స్‌లో సరికొత్త ఫ్యాషన్, పట్టు శారీలు అందుబాటులో ఉన్నాయన్నారు. సంస్థ అధినేత బాపిరాజు మాట్లాడుతూ కంచి కామాక్షి సొసైటీ ద్వారా మొట్టమొదటిసారి తిరుపతిలో షోరూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఇతర షాపులతో పోల్చుకుంటే 40శాతం ధర తక్కువగా ఉంటుందన్నారు. లక్ష్మీ శశిరేఖ పాల్గొన్నారు.



రేపు 'శ్రీవిద్య'లో జాబ్ మేళా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక గోవిందపాలెం లోని శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించనున్నామని ఆ కళాశాల ఛైర్మన్ డాక్టర్ జి ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 18 ప్రముఖ ఎం ఎం సి కంపెనీల లోని వెయ్యికి పైగా ఐటీ, నాన్ ఐటీ ఉద్యోగాల నియామకం చేయనున్నట్లు మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ పి వెంకట ప్రసాద్ తెలిపారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలలోని ఇంటర్, డిగ్రీ, బిటెక్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఎంబీఏ, యంసిఏ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 7780323736, 9885190475 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. మండల పరిధిలోని చెన్నూరు, విందూరు గ్రామాల్లో రూరల్ సిఐ వేణు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వంద మంది పారామిలిటరీ సిబ్బందితో బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తే చట్ట పరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటు ను వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గర్భిణులు ప్రతినెలా డాక్టర్ల వద్ద పరీక్షలు నిర్వహించుకొని జాగ్రత్తలు పాటించాలని గూడూరు ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి పేర్కొన్నారు. గూడూరులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. క్లబ్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గర్భిణులు డాక్టర్లు సూచించిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుష్ప వందన,స్నేహలతా రెడ్డి, నిర్మల, లక్ష్మి, శశికళ, శారీరేఖ పాల్గొన్నారు.

టిడిపిలో యువత చేరిక

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్, టిడిపి నాయకులు రఫీ ఆధ్వర్యంలో సుమారు 500 మంది యువకులు టిడిపిలో చేరారు. బుధవారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో 786 రఫీ ఆధ్వర్యంలో టిడిపి ఉమ్మడి నెల్లూరు విజయశ్రీ, మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఆ పార్టీ నాయకులు కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఏఎంసి డైరెక్టర్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి సమక్షంలో సుమారు 500 మంది యువకులు ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టిడిపి ముఖ్య నాయకులు వారికి ఆ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం పంచాయతీకు చెందిన 20 కుటుంబాలు బుధవారం వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పార్టీ కండువాలు వేసి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా ఐకమత్యంతో ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు.

రామచంద్రాపురం: మండలంలో వైసిపి నుండి పలువురు టిడిపిలో చేరారు. కమ్మపల్లి పంచాయతీలో నీలకంఠ చౌదరి, గణేష్ పురం పంచాయతీలో బాబు నాయుడు లు తన అనుచరులతో బుధవారం పులివర్తి నాని ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. పులివర్తి నాని వారికి పార్టీ కండువను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎం తిరుమలరెడ్డి, జనార్ధన్ చౌదరి, మాజీ ఎంపిటీసీ సురేష్, చిట్టిబాబు, మధుసూదన్, రామిరెడ్డి, కే మధుసూదన్ రెడ్డి, పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: ఏర్పేడు మండలం మేర్లపాకకు చెందిన పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు బుధవారం టిడిపిలో చేశారు. మాజీ జడ్పీటీసీ రాణెమ్మ, మాజీ ఎంపిటీసీ సుహాసిని, మాజీ సర్పంచ్ మల్లీశ్వరి, వైసీపీ నేతలు కోటేశ్వరరావు, సురేంద్రతో పాటు సుమారు 250మంది టీడీపీలో చేరారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.10 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీ ఆదాయం రూ.2,10,62,681 లు వచ్చింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా పై ఆదాయంతో పాటు 128గ్రాముల బంగారం, 592.350 కిలోల వెండి, 216 నోట్లు విదేశీ కరెన్సీ వచ్చింది. ఈ ఆదాయం గత నెల 12వ తేదీ నుంచి 37రోజుల వ్యవధిలో వచ్చినట్లు ఈవో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు.

'గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరచాలి'

ప్రజాశక్తి -ఏర్పేడు : గ్రామీణ జీవనోపాధిని మెరుగు పరచాలని పలువురు పిలుపు నిచ్చారు. ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజెస్ తిరుపతి వారి 'కుటుంబ బలోపేతం' కార్యక్రమంలో భాగంగా శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీతో కలిసి గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరిచే కార్యక్రమం చేపట్టారు. పశువుల పెంపకం , వాటి నిర్వహణపై ఎక్స్పోజర్ విజిట్ ద్వారా పశువుల పెంపకం, మేత పద్ధతులు, పోషకాహారాల అవసరాల గురించి బుధవారం అవగాహన కల్పించారు. పందుల పెంపకంలో అవగాహన కలిగించి వాటి ద్వారా వచ్చే ఆదాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరచడం, ఆర్థిక స్థితిగతుల్ని అభివృద్ధి చేయడం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వి యూనివర్సిటీ సిసివిఇసి కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత, డాక్టర్ గంగరాజు, డాక్టర్ షకీలా, డాక్టర్ సత్యనారాయణ,ఎస్ వై ఎస్ చిల్డ్రన్స్ సంస్థ నుంచి కోఆర్డినేటర్ సత్యనారాయణ, జీనత్ , మునిరత్నం పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న కెనరా బ్యాంకు సిబ్బంది

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్యా విభాగానికి కెనరా బ్యాంక్ ఆర్సి రోడ్డు బ్రాంచ్ రెండు లక్షల రూపాయలు విలువ చేసి ఆట పరికరాలను సిఎస్ ఆర్ పథకం కింద బుధవారం డైరెక్టర్ ఆచార్య సారా సరోజినికి అందజేశారు. చీఫ్ మానేజర్ ఎం.ఉమాపతి, మేనేజర్ కె వినాయక, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టి. నాగరాజురావు ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ కు విచ్చేసి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజినీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ హెడ్ ప్రొఫెసర్ జి సారా సరోజినికి 2 లక్షల రూపాయలు విలువ చేసే చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ పి. చంద్రశేఖర్ సంజీవయ్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ గుడికి వెండి కిరీటాన్ని బహూకరించారు. తిరుపతి ఎంపీ మిద్దెల గురుమూర్తి , ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం , శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారులు బుధవారం అమ్మ వారిని దర్శించుకున్నారు. కోనాటి రమణయ్య యాదవ్ అమ్మవారికి వెండి కిరీటం సమర్పించారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘన

కానిస్టేబుల్ రాజశేఖర్‌పై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించి రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి దిశ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సి రాజశేఖర్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికలు-2024 షెడ్యూలు ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎట్టి పరిస్థితులలో నియమాలను ఉల్లంఘించవద్దని ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ పలుమార్లు ఉద్యోగులకు దిశా నిర్దేశం చేస్తూ హెచ్చరించారు. బుధవారం తిరుపతి దిశా పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న సి రాజశేఖర్ (పిసి-2514) కానిస్టేబుల్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి భాకరాపేట లో ఒక రాజకీయ కార్యక్రమంలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టారు. ఆ కానిస్టేబుల్ ఎలక్షన్ కోడ్ను ఉల్లంఘించారని నిర్ధారణ కావడంతో వెంటనే అతన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పోలీసు అధికారులు , సిబ్బంది తమ వ్యక్తిగత అభిప్రాయాలను బహిర్గతంగా తెలియపరచడం, ఏదైనా రాజకీయ పార్టీల కార్యక్రమంలో పాల్గొనడం వంటి చర్యల ద్వారా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఏకలవ్య పాఠశాలకు అనారోగ్యం

- తీవ్ర జ్వరాలతో ఆస్పత్రి పాలైన విద్యార్థులు- పట్టించుకోని ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చి నాయుడు కండ్రిగ మండలంలోని ఏకలవ్య పాఠశాలను అనారోగ్యం పట్టి పీడిస్తోంది. ఆ పాఠశాలలో సుమారు 500 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో బుచ్చినాయుడు కండ్రిగ హెడ్ క్వార్టర్లో గల ప్రభుత్వ కార్యాలయం కార్యాలయాలు పక్కన ఉన్న ఏకలవ్య పాఠశాలలో 50 మందికి ఒకేసారి కలక వస్తే పట్టించుకోకుండా ఆ ప్రిన్సిపాల్ ఒక రూములో అందరినీ వుంచి విద్యార్థులను చాలా ఇబ్బందికి గురి చేశారు. ఆ వార్త గతంలో 'ప్రజాశక్తి'లోనూ ప్రచురితమైంది. ప్రస్తుతం మండలానికి పాఠశాల దూరం కావడంతో పట్టించుకునే వారు ఎవరూ లేకపోవడంతో ప్రిన్సిపాల్ దామోదర్ నాయుడు ఇష్టానుసారంగా వ్యవహరించడం అనుమానములకు పలువురు విమర్శిస్తున్నారు. గతంలో కూడా ఆయన ప్రవర్తనకు మీడియా వాళ్లు ఆ పాఠశాలకు వెళితే 'మీడియాకు ఇక్కడ అనుమతి లేదు' అని వాచ్మెన్ వద్ద చెప్పి వెనక్కి పంపారు.

విద్యార్థులకు అనారోగ్యం

ఏకలవ్యపాఠశాలలు అంటే క్రమశిక్షణకు మారుపేరు రుచికి, శుచికి, శుభ్రతకు ప్రాధాన్యమిచ్చే పాఠశాలలో అనారోగ్యంతో విద్యార్థులు నలిగిపోతున్న వైనం పేద విద్యార్థుల పేదరిక నిర్మూలన కోసం గిరిజనుల భవిష్యత్తు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏకలవ్య గురుకుల పాఠశాల ద్వారా విద్యాభివృద్ధితో గిరిజన పిల్లలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రవేశపెట్టిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో విద్యార్థులు అనారోగ్యంతో సతమతం అవుతోంది. మండలంలోని కనమనంబేడు ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం సరైన ఆహారం ఇవ్వకపోవడమే కాక సరే నీ వసతులు లేక సౌకర్యాల లేమి పారిశుధ్య



ఆస్పత్రిలో చేరిన విద్యార్థులు

లోపంతో పరిసరాల అపరిశుభ్రత తో విద్యార్థులు విషజ్వరాల బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. గురుకుల పాఠశాలలో భోజన మెనూ సరిగా పాటించకపోవడంతో ప్రతిరోజూ అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రైవేట్ ఆటో ద్వారా 14 మంది విద్యార్థినులను పాఠశాల సిబ్బంది వైద్యం నిమిత్తం బుధవారం ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థులు విష జ్వరాల బారిన పడ్డారు. పట్టించుకోవాల్సిన ప్రిన్సిపాల్ కూడా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు పాఠశాల లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలంటే సమాచారం బయటకు పొక్కదు. పాఠశాలలో ఏమి జరుగుతుందో కూడా తెలియని దుస్థితి. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో గిరిజన విద్యార్థుల ఆరోగ్యం కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఏకలవ్య పాఠశాలపై విచారణ జరిపి ప్రిన్సిపాల్ను మార్చి పేద విద్యార్థులకు రక్షణ కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

టిడిపి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి -రామచంద్రాపురం(తిరుపతి రూరల్): తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఐదేళ్లు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందు బాటులో ఉండి సేవ చేస్తానని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ చంద్రగిరి నియోజక వర్గంలోని దామినేడు గ్రామపంచాయతీ వార్డ్ నెంబర్ రమేష్ అతని అనుచరులతో కలసి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు సిఆర్ రాజన్ కోరిక మేరకు టిడిపిలో చేరారు. బుధవారం వార్డ్ మెంబర్ రమేష్ అతని అనుచరులతో కలిసి యువతతో బైక్ ర్యాలీ నిర్వహించి తనపల్లి వద్ద ఓ కళ్యాణ మండపంలో సుమారు 500 మందితో రమేష్ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.వీరికి పులివర్థి నాన్ని కండువాలు కప్పి పార్టీలోకి సాదరం గా ఆహ్వానించారు. ఈ కార్యక్ర మం లో చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి డి ప్రసాద్ రావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొ న్నారు.



ప్రచారంలో పాల్గొన్న పులివర్తి నాని

తొట్టంబేడు: మండలంలోని కారాకొల్లు పంచాయతీలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఉమ్మడి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితారెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని తన భర్తకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్ఛార్జి గాలి చలపతి నాయుడు, మునిరాజనాయుడు, మాజీ జెడ్పిటిసి వెంకటాచలం, మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు, రవీంద్రారెడ్డి, మునిరత్నం, జనసేన నాయకులకు కొట్టేసాయి, మహేష్, జెడ్పిటిసి తిరుపతయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలను చెలగాటం ఆడొద్దు: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : పదవవ తరగతి పరీక్షలు అంటే విద్యార్థులకు కీలక దశ అలాంటి పరీక్షలు ను అధికారులు నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల జీవితం నాశనం అవుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మండిపడ్డారు. రత్నం పాఠశాల కేంద్రం లో అధికారుల తప్పిదం వల్ల విద్యార్థి అవస్థలు పడిన పరిస్థితి ఏర్పడిందని బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షలకు అన్ని సన్నాహాలు, అవగాహన సదస్సులు, వర్క్ షాప్ లు నిర్వహించిన తరువాతే పరీక్షలు నిర్వహణ ప్రారంభమవుతుందని అన్ని అవగాహనలు ఉన్నవారికే పరీక్షల కేంద్రం వద్ద డ్యూటీ కేటాయి స్తారని అయినా నిర్లక్ష్యం, మూర్ఖత్వానికి విద్యార్థులు బలవుతు న్నారని అవుతు న్నా రన్నారు. డిఈఓ, పరీక్షల నిర్వహణ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఈ తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తు నాశనం కాకుండా కాపాడాలని డిమాండు చేశారు. లేని పక్షంలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంపై పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి

ప్రాచ్య పరిశోధన సంస్థ అపూర్వ సాంస్కృతిక కేంద్రం

- ఆచార్య రాకేశ్ మోహన్ జోషి

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రాచ్య పరిశోధన సంస్థ అపూర్వ సాంస్కృతిక కేంద్రం అని ఆచార్య రాకేశ్ మోహన్ జోషి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఓఆర్ఐ ని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్మెంట్ , బెంగుళూరు , డైరెక్టర్ ఆచార్య రాకేశ్ మోహన్ జోషి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపూర్వ తాళపత్ర సంపద తనని ఆశ్చర్య చకితుడిని చేసిందని, భారతీయ సంస్కృతి ఒక చోట రాసి పోసినట్లుగా గ్రంథాలయం వుందన్నారు. గ్రంథాలయంలోకి వివిధ వాటిని పరీక్షించి, కన్నడ తాళపత్రాన్ని చదివి సంతోషించారు. సంస్థ సంచాలకులు ఆచార్య పిసి వెంకటేశ్వర్లు , రీసెర్చి డెవలప్ మెంట్ డీన్ ఆచార్య విజయ భాస్కర రావు వీరికి సంస్థ ప్రాముఖ్యతను వివరించారు.



గ్రంథాలను పరిశీలిస్తున్న మోహన్‌జోషి

మోహిత్ ను ఆదరించండి: చెవిరెడ్డి లక్ష్మి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: 'అడగకుండానే అన్నీ చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయునిగా ఎన్నికల బరిలో నిలిచిన మోహిత్‌ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా ఆదరిస్తే ఎప్పుడూ అందుబాటులో ఉంటూ పల్లెలను అభివృద్ధి చేస్తారు' అంటూ చెవిరెడ్డి లక్ష్మీ పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీలో 'మీతోనే..మీ మోహిత్ 'ను బుధవారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదరించాలని కోరారు. చంద్రగిరి రూ. 978 కోట్లతో అభివృద్ధి పనులు చేశా రని తెలిపారు. ఈ కార్యక్ర మంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

స్త్రీ, శిశు మరణాలు అరికట్టొచ్చు..

ప్రజాశక్తి -బాలాయపల్లి : పౌష్టికాహారం పంపిణీతో స్త్రీ,శిశు మరణాలు అరికట్టవచ్చని ఐసిడిఎస్ సూపరు వైజర్ రాజేశ్వరి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జయంపు గ్రామంలోని పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న వారు, బరువు తక్కువ, వయసుకు తగిన ఎత్తు లేనివారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. అంగనవాడీ సిబ్బంది, అంగన్ వాడి కార్యాలయంలో పౌష్టికాహారం తినే విధంగా పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశ, మహిళా రక్తహీనత కలిగిన వారిని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సంచరిత, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

మృతురాలి కుటుంబానికి 'సిపాయి' భరోసా

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని మాధవమాలలో ఇటీవల మరణించిన ఎం.వసంతమ్మ కుటుంబానికి అండగా నిలబడి మృతురాలి కుమారుడికి సిపాయి భరోసా బుధవారం అందజేసారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దశరథ రెడ్డి, గ్రామ సర్పంచ్ బల్కిస్ బేగం, వైసీపీ నాయకులు మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సయ్యద్ కరిముల్ల, వైసీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : సేవా దృక్పథం అలవాటు చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి యువశ్రీ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-15, దత్త గ్రామమైన మల్లంగుంటలో మార్చి 18 నుంచి 24 వరకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఇంజనీరింగ్ ఈసీఈ వాలంటీర్లకు ప్రోగ్రాం అధికారి డా. డి యువశ్రీ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రెండవ రోజు బుధవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో వాలంటీర్లు మమేకమై "ఈచ్ వన్ టీచ్ వన్ " కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయురాలు పి. భువనేశ్వరి విచ్చేసి " పాఠశాలలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందదాయకం అన్నారు. విద్యార్థులందరూ సేవాదృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. హిందీ ఉపాధ్యాయులు డాక్టరు హరి మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుతున్న చాలామంది విద్యార్థులు వలస వచ్చిన వారని, వారిలో చదువుకోవాలి అనే ఆసక్తిని వాలంటీర్లు కల్పించాలని కోరారు. అనంతరం ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే పిల్లలకు చిత్రలేఖనం, పద్య పఠనం, వక్తృత్వం,వ్యాసరచన పోటీలను నిర్వహించి,గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.NO. 378 / 2021

కందాటి రాఘవరెడ్డి ...వాది
V/s
తిరగాబత్తినపుల్లయ్య ... ప్రతివాది

నోటీసు

TO:
తిరగాబత్తిన పుల్లయ్య, S/o. రమణయ్య, D.No.13/118, రాజావీధి, Opp: శ్రీ వెంకటేశ్వరస్వామి గుడి, గూడూరు టౌన్ మరియు మండలం, తిరుపతి జిల్లా (గతంలో నెల్లూరు జిల్లా)

అయ్యా
పై దావాలోని వాది తన బాకీని రాబట్టుకొనే నిమిత్తం మీపై హైకోర్టులో పై నెంబరు గల దావా దాఖలు చేసియున్నాడు. సదరు దావా మీ నోటీసు నిమిత్తం తేది:16.04.2024న వాయిదా పడియున్నది. ఆ దినమున ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు ఎదుట మీరు నేరుగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు,
యం.వెంకట క్రిష్ణయ్య
వాది తరపు న్యాయవాది,
గూడూరు, సెల్: 8897654193.

IN THE COURT OF THE V ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
O.S. No. 95 of 2013

Mabbu Siddarth ... **Plaintiff**
Vs.
Mabbu Lakshmamma and others ...**Defendants**

To, **10) M.Danunjaya Reddy, S/o M.Ramachandra Reddy, 11) M.Deenadayal Reddy, S/o M. Ramachandra Reddy, 12) Smt. Padmavathi, D/o M. Ramachandra Reddy, 13) Smt. Gowri, D/o M. Ramachandra Reddy,** Respondents No.s 10 to 13 all are residing at D.No.39, Nehru Street, Tirupati Tirupati District.

SUIT SUMMOINS

Please trake notice that the above suit filed by the plaintiffs against defendants for partition for the plaint schedule properties are posted to 01.04.2024 for your appearance either in person or through your advocate. Failing which the above suit will be decided exparte.

(By the order of the Court)
MATTA PURUSHOTHAM REDDY
Advocate for Plaintiff
Plot No.58, #2-55/A, M.K.Naidu Colony, Bairagipatted, Tirupati. **Ph: 0877-2260022**

యాప్ లపై అవగాహన

ప్రజాశక్తి -తొట్టంబేడు: ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం, ఓటు నమోదు చేయడంలో అవగాహన కల్పించడమేలక్ష్యంగా భారత ఎన్నికల కమిషన్ రూపొందించిన వివిధ యాప్ ల గురించి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఎంపీడీవో బజాగ్ ప్రవీణ్ బుధవారం అవగాహన కల్పించారు. ఓటర్స్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా ప్రతి ఓటరు తన ఓటర్ స్లిప్పును డౌన్లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. యాప్ ద్వారానే పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను తెలుసుకోవచ్చునని చెప్పారు. యాప్ ల గురించి సిబ్బంది అవగాహన కల్పించుకొని, ఓటర్లకు అవగాహన కల్పించి ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడంలో ప్రజలకు తెలపాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్ అధికారిక ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, ట్విట్టర్, యూట్యూబ్ లను సచివాలయ సిబ్బంది అందరూ తప్పనిసరిగా ఫాలో అవుతూ,కలెక్టర్ ద్వారా పోస్ట్ చేయబడుతున్న ఎన్నికలకు సంబంధించిన గైడ్లెన్స్ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సచివాలయ పరిధిలో ప్రజలకు తగు సమాచారము అందజేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్ అండ్ ఆర్ డి తరుణాక్షరెడ్డి, కార్యాలయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు,డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాలలో 64వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఎస్వీ వేదిక్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య రాణి సదాశివమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఉమా ముద్దుబాల అధ్యక్షత వహించారు. టిటిడి అందిస్తున్న ప్రోత్సాహంతో కళాశాల దినదినాభివృద్ధి చెంది అత్యుత్తమ విద్యాసంస్థగా ప్రత్యేక స్థానంలో వుందన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న దేవస్థానం విద్యాశాఖాధికారి డా. భాస్కరరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ కళల పరిరక్షణతో పాటు వ్యాప్తికి ఎస్వీ సంగీత కళాశాల ఎంతో కృషి చేస్తున్నదని కొనియాడారు. ఈ సందర్భంగా సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వినుకొండ సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులతో పాటు ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల హెడ్ ఆఫ్ ది ఇన్స్టిట్యూట్ ఈశ్వరమ్మ, డోలు హెడ్డి వైఎల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా డేగ రవి రాఘవేంద్ర జన్మదినం



రవి రాఘవేంద్ర జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అభిమానులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో ఆల్ ఇండియా ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటీస్ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు డేగ రవి రాఘవేంద్ర పుట్టినరోజు వేడుకలు అభిమానులు, స్నేహితులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా ఎస్సి, ఎస్టి, బీసీ మైనారిటీస్ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు డేగ రవి రాఘవేంద్ర పుట్టిన రోజు వేడుకలు గూడూరులోని వారి కార్యా లయంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి రాఘవేంద్ర కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. రవి రాఘవేంద్రని అభిమా నులు, మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఎంత అభిమానంతో పుట్టినరోజు వేడుకలు ఏర్పాటు చేసిన వారందరికీ రుణపడి ఉంటానన్నారు. భవిష్యత్తులో తమ సంస్థ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎప్పుడు ఎవరికీ ఏ ఇబ్బంది ఎదురైనా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాకాని వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, సుబ్బారావు ,పెంచలయ్య , మణికుమార్ , అయ్యప్ప పాల్గొన్నారు.

బొజ్జల సుధీర్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి -రేణిగుంట : శ్రీకాళహస్తి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఆయన నివాసంలో కృష్ణాపురం టిడిపి నాయకుడు చంద్రయ్య బుధవారం కలిశారు. శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా కృష్ణాపురం టిడిపి నాయకుడు చంద్రయ్య మాట్లాడుతూ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం కృష్ణాపురంలో టిడిపి నాయకులను అణిచివేయాలని చూశారని మండిపడ్డారు. తమపై తప్పుడు కేసులు బనాయించి హత్యయత్నానికి యత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు కృష్ణాపురం నుండి తమను వెళ్లగొట్టేందుకు యత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రభుత్వం తమపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడేది లేదని కార్యకర్తలకు అండగా ఉంటా మన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం టిడిపి యువ నాయకుడు నరేష్ పాల్గొన్నారు.

పాపారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి -వాకాడు: వాకాడు గొల్లపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు పాపారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి ఉత్తరక్రియలు వారి కుమా రుడు మాజీ ఏఎంసి ఛైర్మన్ పాపారెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులతో పాటు, వైసిపి తిరుపతి జిల్లా సమన్వయకర్త, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళి, కోట, వాకాడు, చిట్టమూరు వైసీపీ నాయకులు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్, కోట, వాకాడు, చిట్టమూరు, టిడిపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. వారితో పాటు వ్యాపార వేత్తలు, సినీ పరిశ్రమకు చెందిన వారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సుబ్రహ్మణ్యం రెడ్డి జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

వైసిపి నాయకుని సోదరుడు గోతిలో పడి మృతి



మృతి చెందిన రుక్మాంగధరెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వైసీపీ నాయకులు కెఎంఆర్ విద్యాసంస్థ ఛైర్మన్ కేటి ప్రసాద్ రెడ్డి సోదరుడు కే రుక్మాంగధ రెడ్డి మోటారు సైకిల్‌పై వెళుతుండగా మున్సిపల్ పార్కు ప్రహరీ గోడ నిర్మాణానికి తవ్విన గోతిలో పడి మృతి చెందాడు. ఆయన బుధవారం ఇంటి నుంచి వెళుతుండగా ఈ సంఘటన చోటు చేసు కుంది. స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని చింతల గుంటను పూడ్చివేసి నూతనంగా మినీ పార్కు నిర్మాణం చేపట్టారు. ప్రహరీ గోడ నిర్మాణానికి గుంతలు తవ్వారు. వైసీపీ నాయకులు కేఎంఆర్ విద్యాసంస్థ ఛైర్మన్ కేటి ప్రసాద్ రెడ్డి సోదరుడు కే రుక్మాంగధ రెడ్డి మోటార్ సైకిల్‌పై ఇంటి నుంచి వెళుతుండగా అదుపుతప్పి గోతిలో పడ్డాడు. ఆ సమయానికి అటువైపు ఎవరూ రాక పోవడంతో గోతిలోనే గడిపాడు. కొద్దిసేపటి తర్వాత అటు వైపు వెళుతున్న స్థాని కులు గోతిలో పడిపోయిన సంగతని పరిశీలించారు. వెంటనే రుక్మాంగధ రెడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తుది శ్వాస విడిచాడు. రుక్మాంగధ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడము ఏమనగా నాకక్షిదారి అయిన లోడారి జ్యోతి, భర్త లోడారి ప్రసాద్, లోడారి వివేక్, తండ్రి ప్రసాద్ వారి సంజాయిసి ప్రకారం ఇవ్వబడిన ప్రకటన ఏమనగా మా కక్షిదారులు దిగువ చూపిన షెడ్యూలు ఆస్థిని డాక్యుమెంట్ నెంబర్స్ 32 68/2016 మరియు 3267/2016 ద్వారా కొనుగోలుచేసినారు. సదరు పత్రంకూ సంబంధించిన లింకు డాక్యుమెంట్ నెం.బరు 3246/2016ను తీసుకుని గూడూరు 1 Town లో జిరాక్స్ కాపీ కోసం 11/03/2024న పోగా సదరు పత్రం కనిపించకుండా పోయినది. ఆ విషయం మా కక్షిదారు భర్త అయిన లోడారి ప్రసాద్ గూడూరు 1 పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సదరు పోలీసు వారు 18/03/2024న సదరు డాక్యుమెంట్ నెంబరు 3246/2016 దొరకలేదని సర్టిఫికేట్ మంజూరు చేసి ఉన్నారు. ప్రస్తుతం మా కక్షిదారులు 3268/2016 మరియు 3267/2016 పత్రములను బ్యాంకులో డిపాజిట్ చేసి లోన్ సౌకర్యం పొందవలెనని ప్రయత్నిస్తున్నారు. సదరు లింకు డాక్యుమెంట్స్3246/2016 ఎవరి వద్దనైనా తనఖా వుండిన యెడల ఈ క్రింది అడ్రసు వారికి వారం రోజులు లోపల తెలియపరచవలెను. లేని యెడల సదరు పత్రంపై ఎవరికీ ఎటువంటి హక్కులేదని నిర్ధారించి మా కక్షిదారులు లోను పొందురు.

షెడ్యూల్

S.P.S.R. నెల్లూరు, గుడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, గూడూరు సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసు, మనుబోల్ మండలం, వీరంపల్లి గ్రామ పంచాయతీ ఏరియా, రాజువోలు పాడు గ్రామం, ఖాతానెం. 1560, సర్వే నెం.481 ఎకరం 0.96 సెంట్లు ఆట్ of 5 ఎకరాలు 88 సెంట్లు, సర్వే నెంబరు 482/16 3 ఎకరాల 85 సెంట్లు మొత్తం వీస్తీర్ణం 4.41 సెంట్లు.
తూర్పు-వాగు, దక్షిణం-ఓల్లూరు రమణారెడ్డి భూమి, పడమర- కనుపూరు కాలువ, ఉత్తరం- లోడారి జ్యోతి భూమి.

ఇట్లు
కందనూరు వెంకటకృష్ణయ్య
అడ్వకేట్, గూడూరు,
9440113977